# నా గోస ఎవరికి చెప్పుకోవాలి

- కండ్ల ముందే పంటెండుతున్నది
- నీళ్లు లేక చాలా బాధగా ఉన్నది
- గతంలో అధికారులు స్పందించేవారు
- ఇప్పుడు ఎవరూ పట్టించుకుంటలేరు
- కనీసం 20 గంటలైనా ఇవ్వండి
- ఉపాధి హామీ ఏపీవో ఆవేదన



అంజిరెడ్డి, ఏపీవో

నర్సాపూర్, ఏప్రిల్ 28: నీళ్లులేక ఎండుతున్న పంటను చూసి తట్టుకోలేకపోతున్నానని ఉపాధి హామీ ఏపీవో సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తంచేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవోగా పనిచేస్తున్న శివ్వంపేట మండలం చండీ గ్రామానికి చెందిన అంజిరెడ్డి పంటల దుస్థితిపై కలత చెందారు. కరెంట్ సరిగ్గా రాకపోవడంతో తాను వేసిన పంట ఎండిపోతున్నదని ఆదివారం వాట్సాప్‌లో తన ఆవేదనను వ్యక్తపరిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ.. కేవలం 15 గంటలు మాత్రమే ఇస్తుండటంతో తన పొలం ఎండి పోతున్నదని చెప్పుకొచ్చారు. దయచేసి 24 గంటల కరెంట్ మరో పది రోజులు ఇవ్వాలని, ఒకవేళ ప్రభుత్వం దగ్గర కరెంట్ కొనడానికి డబ్బులు లేకపోతే కనీసం 20 గంటలైనా ఇవ్వాలని కోరారు.సబ్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా.. 'పైనుంచి త్రీ ఫేజ్ వేయమంటేనే వేస్తాం. ఇంకా ఎలాంటి మెసేజ్ రాలేదు' అని విద్యుత్తు అధికారులు చెబుతున్నారని వెల్లడించారు. ఇంతకు ముందున్న విద్యుత్తు అధికారి స్పందించే వారని, ఇప్పుడున్న ఏఈకి ఎప్పుడు ఫోన్‌చేసినా అందుబాటులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 24 గంటల కరెంట్ సరఫరా చేసి పంటలను గట్టెక్కించాలని కోరారు.

# జన్యు చికిత్సతో కంటి సమస్యకు పరిష్కారం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : వారసత్వంగా వచ్చే రెటీనా వ్యాధులను గుర్తించేందుకు రెటీనాల్ పిగ్మెంట్ ఈపీథీలియం(ఆర్‌పీఈ)65లోని ఉత్పరివర్తనాలు ఎంతగానో సహకరిస్తాయని ఎల్‌వీ ప్రసాద్ కంటి అధ్యయన సంస్థ పరిశోధనలో తేలింది. కంటి వైద్య నిపుణులు చిత్ర కన్నబీరన్, దీపికా పరమేశ్వరప్ప, దీపక్ బగ్గా రెటీనా వ్యాధులపై అధ్యయనం చేశారు. ఈ పరిశోధనల్లో అరుదైన, వశంపారంపర్యంగా వచ్చే కంటి వ్యాధుల్లో రెటీనా పిగ్మెంట్ ఈపీథీలియం వ్యవస్థ దెబ్బతినడం వలన తీవ్రమైన దృష్టి లోపాలు వస్తాయని, బాల్యంలోనే రెటీనాలోని ఉత్పరివర్తనాల లోపాలు సర్వసాధారణంగా ఉన్నాయని గుర్తించారు. కంటిపై పడిన కాంతిని జీవరసాయన ప్రక్రియ ద్వారా విద్యుత్ సంకేతాలుగా మార్చి మెదడకు అందజేసే ప్రక్రియలో కొన్ని లోపాలు జన్యుపరమైన సమస్యలకు కారణం అవుతాయని తేల్చారు. ఎల్వీపీఈ వైద్యుల పరిశోధన జర్నల్ ఆప్తాల్మిక్ జెనెటిక్స్‌లో ప్రచురితమైంది. ఈ అధ్యయనానికి వారసత్వంగా కంటి సమస్యలున్న 260 మంది జన్యువులతో సీక్వెన్సింగ్ చేయడం వలన రెటీనాల్ పిగ్మెంట్ ఈపీథీలీయం లోపాలను గుర్తించినట్లుగా తేల్చారు. చిన్న వయసులోనే ఈ లోపాలను గుర్తిస్తే సవరించే అవకాశం ఉంటదని వెల్లడించారు.

# కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయం

ఖైరతాబాద్, ఏప్రిల్ 28: ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో కలుపుతామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్.. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నదని గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ నెల 14న నారాయణపేటలో జరిగిన ఎన్నికల సభలో బీసీ-డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో కలుపుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశంపై ఇలాంటి హామీలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ యోచనను విరమించుకోవాలని కోరారు.




















